కోరిన కోనలో కురవని వాన

ఏ కాలేజీ లెక్చరరయినా 'ఆకలి'ని గురించి 'తీసీస్' వ్రాయదలుచుకుంటే నేనతడికి సత్తిరాజు పేరు రికమండ్ చేస్తాను. ఆంధ్రా – మైసూరు బార్డరు దగ్గర్లో ఎక్కడోవున్న ఓ చిన్న పల్లెలో అతడి పుట్టుక. అక్కడ రాగులు తప్పితే మరొక ఆహారధాన్యం పండదట! అదైనా వెలిపంట. అయిదారు చాళ్ళు దున్నిన మెట్టపొలాల్లో రాగులు చల్లేస్తే దేవుడి దయవల్ల సకాలంలో వర్షాలు కురిస్తే పంట దండిగానే పండుతుంది. ఆ రాగిపిండి వంటకానికి ఒక్కటే అనుపానం – ఎండు మిరపకాయల చట్నీ. "ఎంత బాగుంటుందో నీకేం తెలుసులేవయ్యా రామంబాబూ! ఒకసారి రుచిచూచావంటే జన్మానికి వదల్లేవు" అంటుండేవాడు సత్తిరాజు.

సత్తిరాజు ఎంతగా ప్రలోభపెట్టినా చప్పటి రాగిపిండి వంటకంలోను, ఎండు మిరపకాయల గొడ్డుకారంలోను, గొప్ప గొప్ప రుచులు నిక్షిప్తమై వుంటాయని నేననుకోలేదు. కానైతే ఈ స్టేట్‌మెంటు వెనకాలవున్న సత్తిరాజు ఆంతర్యాన్ని మాత్రం సానుభూతితో అవగాహన చేసుకోడానికి ప్రయత్నించాను. ఈ సందర్భంలో నాకొక అరేబియా జానపద గాథ జ్ఞప్తికొస్తుండేది. ఒకానొక ఎడారి వర్తకుడు తన బిడారు నుంచి విడిపోయి దారితప్పి, ఇసుకపర్రల్లో తిరిగి తిరిగి అలసిపోయాడట. విపరీతమైన దాహబాధతో అతడి నాలుక పిడచగట్టుకపోయింది. గ్రుక్కెడు నీళ్ళు దొరక్కపోతే ప్రాణాలు గుట్టుక్కుమనేటట్టున్నాయి. అలాంటి నిస్సహాయ పరిస్థితిలో అతడికొకచోట బండరాళ్ళకు నడమగావున్న గోయిలో కొద్దిపాటి నీళ్ళు కనిపించాయి. అతడా నీళ్ళను దోసిళ్ళకొద్దీ త్రాగేశాడు. చిత్రమేమిటంటే, అవి అతడిపాలిటికి అమృతంలా వున్నాయి. ఈ యిలాతలం పైన అంతటి మంచినీళ్ళు మరెక్కడా వుండబోవనుకున్నాడు. తాను త్రాగినంత త్రాగి మిగిలిన నీళ్ళను తనదగ్గరవున్న తోలుసంచిలోకి నింపి, తీసుకెళ్ళి బాగ్దాదు నగర ఖలీఫాగారికి సమర్పించాడు. ఖలీఫాగారు త్రాగి చూద్దురుగదా, ఆ నీళ్ళల్లో ఆయనకు చెప్పుకోదగ్గ మాధుర్య విశేషమేమీ కనిపించలేదు. ఆయన కవి మామూలుగానే వున్నాయి.

ఒకానొక వస్తువు మానవుడికి రుచించడంగానీ, రుచించకపోవడం గానీ వస్తుధర్మం పైన ఆధారపడి వుండదు. ఆ వస్తువు యొక్క ఆవశ్యకతపైన ఆధారపడి వుంటుంది. పాపం, తన చిన్నతనంలో తిండికోసం ముఖం వాచిపోయి వుండేవాడేమో సత్తిరాజు, ఏ మాత్రం ఖాద్యపదార్థంలాంటి వస్తువు కనుపించినా ఆవురావురంటూ తినేసేవాడేమో!

వీలయినంత సున్నితంగానే నేనీ అభిప్రాయాన్ని ప్రకటించేవాణ్ణి.

"ఆ మాటెందుకు లేవయ్యా రామంబాబూ!" అనేసేవాడు సత్తిరాజు. అంటూ అంటూ పెండోరాస్ బాక్స్‌లాంటి తన జ్ఞాపకాల భోషాణాన్ని తెరిచేసేవాడు.

పిలవకపోయినా కరువులు, కాటకాలు పలికేచోట పుట్టి పెరిగాడు సత్తిరాజు. ఎండాకాలమొచ్చేసరికి అక్కడ బావుల్లో త్రాగుడునీరు సైతం అడుగంటుక పోతుండేది. ఊరికంతా మోతుబరి అయిన పెద్దరెడ్డిగారింట్లో పనీపాటా చేసుకుంటూ వుండేది సత్తిరాజు తల్లి. వాళ్ళు మిగిలితే అన్నం పెట్టేవాళ్ళు. ఒక పూట తింటే, యింకొక పూట తినగలమన్న నమ్మకానికి ఆస్కారం లేని అనిశ్చిత పరిస్థితుల్లో గడిచిపోయింది సత్తిరాజు బాల్యం.

"రామంబాబూ! ఆకులలములు మేసి బ్రతకడమంటే ఏమిటో ఎరుగుదువా?" అనేవాడు సత్తిరాజు.

"అదెలాగయ్యా?" అనేవాణ్ణి.

"మావూరికవతల మల్లేశ్వరుడి గుట్టలున్నాయి. ఆ గుట్టలు దాటుకుంటే దేవదారు కోన. చిక్కం భుజాన తగిలించుకొని, తెల్లవారుజామున్నే లేచి వెళ్ళిపోయేవాళ్ళం. మధ్యాహ్నానికల్లా దేవదారాకుతో చిక్కం నిండిపోయేది. చిక్కం నిండడమంటే ఏమిటనుకున్నావ్? అది మాకు వారం పదిరోజుల మేత. ఏం లేదు. ఆకును బాగా ఎండకు వెయ్యాలి. ఉడక బెట్టాలి. ఉప్పురాళ్ళు వెయ్యాలి. కమ్మగా వుండేటందుకు వేరుశనగ గింజలు చిలిమిడిగా నూరి అందులో కలిపెయ్యాలి. పట్టెడాకుతిని, ఒక లోటా నీళ్ళు త్రాగేస్తే మళ్ళీ ఒకజాము సేపటిదాకా ఆకలి నీ దగ్గరికి రాదు..."

ఉండివుండీ యిలాగే తన అనుభవాల్లో ఒక్కొక్కటి నా చెవిలో వేస్తుండేవాడు సత్తిరాజు.

"రామంబాబూ! ఈతగడ్డలు తిన్నావా ఎప్పుడైనా?"

"అవెక్కడ దొరుకుతాయి?" అనేవాణ్ణి.

"మార్కెట్టులో దొరకవులే! గెలవేస్తున్న ఈతచెట్టును చూసి బోసిగా మట్టలన్నీ కొట్టేయాలి. గునపంతో త్రవ్వి బోదెలోనుంచి గడ్డలు పైకి తియ్యాలి. ఈతగడ్డంటే ఏమిటనుకున్నావో రామంబాబూ! ఆకలిగావున్న ప్రాణానికి అది కలకండ పెళ్లేననుకో!"

ఎన్నో సిద్ధౌషధాలను గురించి వినివున్నాను. సిద్ధులు కొందరు తమకు చేతనైన మహిమద్వారా ఏవేవో అద్భుత కార్యాలు నిర్వహిస్తుంటారని గూడా నాకు తెలుసు. అయినా మందులుగానీ, మహిమలుగానీ ఆకలి బాధను శాశ్వతంగా నివారించలేకపోయాయి. ఆ కాడికి సత్తిరాజెంతో నయం. దేవదారాకు, ఈతగడ్డలు మొదలైన వాటిద్వారా క్షుద్బాధన తాత్కాలికంగానైనా జయించే ఉపశమన క్రియలను కనిపెట్టిన ఘనత నాకు తెలిసినంతలో సత్తిరాజుకే దక్కుతుంది.

చేతిపనుల కోపరేటివ్ సొసైటీ వాళ్ళు బజారువీధిలో ఒక సేల్స్ ఎంపోరియం ఏర్పాటు చేశారు. ఎసెసెల్సీలో ఫెయిలై, కడుపు చేతబట్టుకొని తిరుగుతున్న సత్తిరాజు వాళ్ళు కోరిన హిరణ్యాక్షరాల కన్నిటికీ సమ్మతించి అందులో సేల్స్‌మాన్ వుద్యోగం సంపాదించాడు. నెలజీతం డెబ్బయి అయిదు రూపాయలు. ఎంత నాలీసు భోజనానికైనా పూటకు రూపాయ పెట్టవలసివచ్చేది. రెండు వేళలా టిఫిను చేయాలంటే యింకొక ముప్పై రూపాయలుండాలి. ప్రాణావసరమైన తిండి కన్నా ముఖ్యంగా మరికొన్ని బాదరబందీలు సృష్టించినందుకు మనం నాగరికతను కసిదీరా తిట్టుకోవాలి. ఆదిమయుగాల్లో మనిషి ఒక ఆటవిక జంతువుగా బ్రతికిన బంగారు కాలాన్ని గురించి తలపోస్తూ తన ఆక్రోశాన్నంతా వెలిబుచ్చేవాడు సత్తిరాజు. "చూడవయ్యా రామంబాబూ! అప్పట్లో మానవులు పచ్చిమాంసమే తిన్నారో, కాయగసురులే తిన్నారో మనకనవసరం. ఒకటి మట్టుకు నిజం. ఆనాటి మానవుడు పస్తులతో మాడి మాత్రం చావలేదు. ఆకులో, బెరళ్ళో మొలకు చుట్టుకునేవాడు గనుక బట్టలుకొనే తాపత్రయం అసలే లేదులే. అసలే లేకపోతే చూలేమిటన్నట్టు యిక చాకళ్ళనుగురించి మంగళ్ళను గురించి వాడికి కాబట్టే వుండదు. నువ్వూ నేనూ అలా బ్రతగ్గలమా? ఎంతటివాళ్ళకు లభించేదయ్యా అంతటి భాగ్యం!"

వాస్తుశాస్త్రంలో మయుణ్ణి చంపిపుట్టిన మహాశిల్పి ఒకాయన వుండేవాడు. ఆయన పేరు పెరుమాళ్ళు మేస్త్రి. తన సుదీర్ఘ జీవితంలో అనుభవ పూర్వకంగా సంపాదించిన

విజ్ఞానాన్నంతా వినియోగించి ఆయన పట్టణం పొలిమేరలో ఒక మూడంతస్తుల భవనరాజాన్ని నిర్మించాడు. వానలు కురిస్తే చుట్టూరా నీళ్ళు నిలిచి ఒక తటాకం ఏర్పడిపోతుంది. అప్పుడు చూడాలి దాని రామణీయకం! సముద్రంలో తెరచాపలేని పడవనైనా ఆనుకోవచ్చు. లేదా దాల్ సరస్సులో తేలియాడే గృహమనైనా అనుకోవచ్చు. సుమారుపాటి బలవంతుడొకడు ఈడ్చి ఒక తన్ను దన్నితే గోడలు, తలుపులు, పైకప్పు విరిగి, వూడి, కూలి, అక్కడొక మట్టిదిబ్బ మాత్రం మిగిలిపోయే పరిస్థితి! ఆ కట్టడంలో పావురాళ్ళ గూళ్ళలాంటి గదుల్లో దిక్కుమాలిన పావురం సత్తిరాజు. ఈ పావురాలమీద నిఘా పెట్టి ఆకాశంలో ప్రదక్షిణాలు తిరిగే డేగలాంటి వాడు పెరుమాళ్ళు మేస్త్రీ. సకాలంలో అద్దె చెల్లించలేక ఆ పావురం ఈ డేగచేత చిక్కి బిక్కిరించినప్పుడు సత్తిరాజును అడపా దడపా ఆదుకున్న వాళ్ళల్లో నేనూ ఒకణ్ణి. సత్తిరాజుకు అప్పుల్ని తిరిగి చెల్లించే సదుపాయాలు చాలా తక్కువ. అతడికి కాళ్ళున్నాయి. చేతులున్నాయి. ఎవరేపని చెప్పినా మారుమాట లేకుండా చేసిపెట్టేవాడు. కానీ మానవుడి శరీర శ్రమకు గూడా ఒక మూల్యం వుందన్న స్పృహలేని సమాజంలో సత్తిరాజులాంటి వాళ్ళు ఋణ విముక్తులు గావడం ఎలా సాధ్యం? వాళ్ళు కొండంత కృతజ్ఞతను తలపైన మోస్తారు. ఆ బరువు క్రిందనే కృంగి పోతారు.

పెరుమాళ్ళు మేస్త్రీ గృహసామ్రాజ్యంలో నేనూ ఒక పౌరుడినే అయినప్పటికీ హోదాలో సత్తిరాజుకూ నాకూ కొంత తేడా వుండేది. బిల్లు కలెక్టర్నిగా మునిసిపాలిటీ వాళ్ళు నాకిచ్చే నూటపాతిక రూపాయలు చాలకపోతే యింటికి వ్రాసి పదో పరకో తెప్పించుకునే వెసులుబాటు వుండేది గనుక గుడ్డిలో మెల్లగా నేను కాస్తా దిక్కున్న పావురాన్ని. సత్తిరాజు గదికీ, నా గదికీ గట్టి అట్టలాంటి గోడ ఒకటే అడ్డం. రాత్రివేళల్లో నా గదిలోకి వచ్చి కూర్చుని ఏవో కబుర్లతో కాలక్షేపం గావించేవాడు సత్తిరాజు. హైస్కూల్లో చదువుకున్న కాలంలో వారాలపిల్లాడుగా సత్తిరాజు గడించిన అనుభవాలు అన్నీ యిన్నీ కావు. పది పన్నెండు కుటుంబాల మంచి చెడ్డల్ని అతడు క్షుణ్ణంగా బేరీజువేసి పెట్టుకున్నాడు. పెట్టిన తల్లికి నమస్కారాలు! పెట్టని పుణ్యాత్మురాలిపైకి శాపబాణాలు! 'ఇంత ఆలస్యమైందేం బాబూ? రా. కాళ్ళు కడుక్కో' అంటూ ఆదరించిన గృహిణికి అభినందనలు. 'వచ్చావూ! నువ్వొకడవి మాకు శనిగాడిలా దాపురించావు. ఈ రోజు బంధువు లొచ్చారుగానీ వెళ్ళు వెళ్ళు' అంటూ చీదరించుకున్న యింటావిడకు అభిశంసలు, ఇలా ఎంతసేపైనా సాగిపోతుండేది సత్తిరాజు ప్రసంగం. ఏ పన్నెండు గంటలప్పుడో నేను చిరాకుపడుతూ 'వెళ్ళి పడుకోరాదా సత్తిరాజూ!' అంటే 'పడుకుంటే నిద్రపడుతుంది గనకనా? ఎనిమిది గంటలప్పుడు తిన్న తిండి పదింటికే జీర్ణమైపోయింది, ఇప్పుడిక నాలుగరటిపళ్ళుతిని అరపడి పాలు త్రాగితేగాని నిద్రపడుతుందనే ఆశలేదు' అనేవాడు. "చాలించవయ్యా బాబూ! మనలాంటి సామాన్యుల కడుపుల్లో యింతింతలావు జఠరాగ్ని వుండటం ప్రమాదకరం" అనేవాణ్ణి. "నన్నేంచేయమంటావయ్యా రామంబాబూ! నాకింత ఆకలిగా వుండడం ఎందుకని? దీని కంతకూ కారకురాలు మా అమ్మ. చచ్చి ఏ లోకంలో వుందోగానీ, బ్రతికి గనకవుంటే ఆమెపైన నేను కోర్టులో కేసు వేసినా తప్పులేదు" అంటూ చివరి కతడు గాడిద పాలు వృత్తాంతాన్ని ఏకరువు పెట్టేవాడు.

"అసలేం జరిగిందంటే రామంబాబూ! నేను పుట్టేటప్పటికి మా కుటుంబ స్థితిగతులు కొంచెం మెరుగ్గానే ఉండేవట! మాకొక రెండెకరాల కొంద్రగూడా వుండేదట! మా నాన్న

చీట్లాటలోపడి అయినకాడికి అప్పులు చేస్తూ వచ్చాడట! వడ్డీలు పెరిగి, పెరిగి ఆ అసలు ఫాయిదాల వరదలో ఆ ఆస్తి కొట్టుకపోయింది. ఆ బెంగతోనే మా నాన్న కాయలాపడి, కడకు కళ్ళు మూశాడనుకో! అదంతా వేరేకథ. ఇప్పుడు చెప్పొచ్చింది గాడిద పాలును గురించి. నేను పురిట్లో బిడ్డనుగా వుండగా మా అమ్మ వరుసగా మూడు రోజులు నాచేత గాడిద పాలు త్రాగించిందట! గాడిద పాలు త్రాగడమంటే ఏమిటనుకున్నావు? జీవితాంతం యిక జఠరాగ్ని నిద్రపోదన్నమాటే! కడుపులో రాళ్ళువేసినా జీర్ణమైపోవలసిందే! నిద్రపట్టని రాత్రుల్లో నాకిదే ఆలోచననుకో! అరణ్యవాసంలో వుండగా పాండవులకు సూర్యుడొక అక్షయ పాత్రను ప్రసాదించాడట! నా కలాంటి దొకటి దొరికినా బాగుండి పోవును! తెల్లవారేసరికి డజను యిడ్లీలు, పది గంటలకు చక్కగా ఒక లోటా టొమాటో జ్యూసు, ప్రొద్దు నడిమింటికొచ్చేసరికి ఒక ప్లేటు బిర్యానీ, రెండో మూడో ఆమ్లెట్లు..."

"బాగుందిలే వరుస! అయినా మానవుడికి అత్యాశ పనికిరాదు. ఇసుకలో పడుకుని పసిడిమేడలు కట్టుకోడమంటే ఏమిటో యిప్పుడు నీ మాటల ద్వారా తెలిసొచ్చింది" అనేవాణ్ణి.

"పోనీ, జన్మకంతా శివరాత్రిగా ఒక్కటంటే ఒక్కరోజు, కనీసం ఒక్క పూటయినా తృప్తిగా అలాంటి భోజనం దొరికే అవకాశం మనకు దొరక్కూడదా రామంబాబూ?" అంటూ నావైపు జాలిగా చూచేవాడు సత్తిరాజు.

"తిండి తినడం, నిద్రపోవడం మొదలైనవి ప్రాణుల సహజ ధర్మాలు. ఆధునిక రాజ్యాంగాలు కర్మ సిద్ధాంతాన్ని ఖాతరు చెయ్యవు గనుక మానవుడు కడుపు నిండా తినాలనుకోడం చట్టరీత్యానేరంగాదు. కానీ హక్కుండడంతో ఏమయింది? అవకాశ ముండాలి గదా!" అనేవాణ్ణి. "అవకాశం తేరగా దొరుకుతుందా? దాని కోసం వెతకాలి" అనేవాడు సత్తిరాజు.

"ప్రయత్నించు బాబూ! నీ ప్రయత్నం ఫలిస్తే సంతోషిస్తాను" అన్నాను.

'యురేకా, యురేకా' అంటూ పరుగెత్తుకొచ్చిన ఆర్కిమెడీస్‌లా ఓ రోజు సాయంకాలం ఆనందం తుళ్ళింతలాడుతున్న ముఖంతో వూడిపడ్డాడు సత్తిరాజు. "రామంబాబూ! దొరికిందయ్యా దారి, కనిపెట్టేశానయా ఉపాయం' అన్నాడు.

"అదేమిటో చెప్పవయ్యా బాబూ!" అన్నాను ఆశ్చర్యపడిపోతూ.

సత్తిరాజు చెప్పాడు.

అతడి ఉపాయమేమిటో విని నే నాదిలో పెదవి విరిచినమాట నిజమే! కాని నింపాదిగా ఆలోచించిన మీదట అదీ అమోఘమైన ఉపాయంగానే తోచింది. నీ కోరికల్ని నువ్వు నెరవేర్చుకోలేనప్పుడు, వాటిని నెరవేర్చగల వ్యక్తి చేతికి గాని, సంస్థ చేతికిగానీ నీ జీవితాన్ని తీసుకెళ్ళి అప్పగించటంలో తప్పులేదు. కాస్త రిస్కుతో కూడిన వ్యవహారమే కావచ్చుగాక! ఆ మాత్రం రిస్కు తీసుకోకపోతే జీవితం ఒక చోట పడవేసిన గొంగడిలా జడ ప్రాయంగా వుండిపోతుంది.

మరునాటి ఉదయం పదిగంటలకు మేము రిక్రూట్‌మెంటు ఆఫీసు ఎదుట తచ్చాడుతున్నాము. అందుకని వచ్చిన ఆఫీసరు ఎత్తు, బరువు, ఛాతీ మొదలైన వివరాలు నమోదు చేశాడు. ఒక డాక్టరుగారు ఆరోగ్య పరీక్షలు ముగించాడు. సాయంకాలం లిస్టు వేస్తామన్నారు. ఆలోగా మిత్రుల నందరినీ ఒకసారి కలుసుకుని గుడ్‌బై చెప్పి రావాలనిపించింది. వెళ్ళొద్దాం రమ్మని సత్తిరాజును పిలిచాను. అతడెందుకో ఉత్సాహంగా లేదు.

"ఏం చెప్పమంటావు రామంబాబూ! ఎక్కడికి వెళ్ళినా నా దురదృష్టం నన్ను వెంటాడుతూనే వుంది. చిన్నప్పుడు మల్లేశ్వరి గుట్టపైన కాలుజారి పడ్డాను. మోకాటి క్రింద ఎముక విరిగింది. పుత్తూరు తీసుకెళ్ళి మా అమ్మ కట్టు గట్టించు కొచ్చింది. నేను కాలుకాస్తా ఎగరేస్తూ నడుస్తుండడం అందుకే! డాక్టరుగారీ విషయం పసిగట్టేశారు. కాలూ, చెయ్యీ సరిగ్గా లేనివాడు మిలిటరీకేం పనికొస్తాడు చెప్పు!"

అనుకున్నంతా అయింది. ఎన్నికయిన వ్యక్తుల జాబితాలో సత్తిరాజు పేరు కనిపించలేదు.

మిలిటరీ ఉద్యోగుల వెంట బయల్దేరిన నాకు ప్లాట్‌ఫారం పైన నిలబడి సత్తిరాజు వీడ్కోలిచ్చిన సంఘటన అదొక విషాదోదంతంగా మనసులో నిలిచిపోయింది. "చూచావా సత్తిరాజూ! ఒకడు చేసిపెట్టిన ప్రయోగాన్ని అందిపుచ్చుకుని, యింకొకడు ప్రయోజనం పొందడమంటే యిదే! నువ్వు గనుక చొరవ తీసుకోకుంటే నా బ్రతుకు బాట మారివుండేదేగాదు. జీవితంలో నిన్నెప్పటికీ మరచిపోలేను. సెలవుల్లో వచ్చినపుడు నిన్ను కలుసుకుంటాను. కులాసాగా ఒకటి రెండు రోజులు కలిసి కాలక్షేపం చేద్దాం? వెళ్ళగానే అడ్రసు తెలియజేస్తాను. తరుచుగా ఉత్తరాలు వ్రాస్తూ వుండు..."

"అలాగలాగే" అన్నాడు సత్తిరాజు.

అయితే అతడి దగ్గరనుంచి నాకు వచ్చినవల్లా రెండు మూడు వుత్తరాలే! ఆరుమాసాల అనంతరం నేను మిలిటరీ క్యాంపునుంచీ అతడికి వ్రాసిన ఉత్తరం సేల్స్ ఎంపోరియం మూసివేశారన్న రిమార్కుతో నాకు తిరిగి వచ్చింది.

* * *

పదేళ్ళ అనంతరం మళ్ళీ ఒకసారి ఆ పట్టణంలో కాలుమోపాను. నాటికీ నేటికీ నగరం బాగా పెరిగింది. అరణ్యంలో ఒక వనమూలికను కనిపెట్టినట్టుగా యింత పెద్ద పట్టణంలో ఒక చిరునామా తెలియని వ్యక్తిని వెదికి పట్టుకోవడం చాలా కష్టమే! గడచిన పదేళ్ళలో, నేను దేశమంతటా కలియతిరిగాను. రకరకాల వ్యక్తులను కలుసుకున్నాను. క్షేత్రాలు సందర్శించాను. ఎన్నో జీవితానుభవాలు గడించాను. ఇన్నింటికీ మూల కారకుడైన వ్యక్తిని కలుసుకోవాలన్న బలీయమైన కోరిక నన్నీ నగరంలో దింపింది. అతడికి నేనెంతటి ప్రత్యుపకారం చేసినా చేయవచ్చు. సత్తిరాజు అల్ప సంతోషి, అతడికి సంతృప్తి కలిగించడం చాలా సులువు. తాను కోరుకున్న భక్ష్యభోజ్యాలతో ఒకపూట భోజన సుఖం చేకూర్చిన చాలు.

ఇంత దూరం వచ్చాక మళ్ళీ ఒక అనుమానం – ఇంతకూ సత్తిరాజు ఇంకా ఈ పట్టణంలోనే ఉన్నాడా అని!

ఈ అస్తినాస్తి విచికిత్సతో ఒరిగేదేమీలేదని, ఆలోచన కట్టిపెట్టి, అన్వేషణలోకి జొరబడ్డాను. మొదట సేల్స్ ఎంపోరియం వుండినచోటుకి వెళ్ళి చూచాను. ఇప్పుడక్కడొక చెప్పులషాపు తెరిచారు. పూర్వ పరిచితులైన మిత్రులెవరైనా కనిపిస్తారేమోనని రోడ్లవెంట పడ్డాను. సందుల్లో గొందుల్లో తిరిగాను. అంతలో మిట్టమధ్యాహ్నం కావచ్చింది. వేళకాగానే పరుగెత్తుకుంటూ వెళ్ళి డైనింగు టేబిలు దగ్గర కూచోడానికి అలవాటుపడిన ప్రాణం! ఈ ఊళ్ళో 'ఎల్లోరా' అన్న హోటలొకటి ఉండాలి. అప్పట్లో రుచికరమైన వంటకాలకది పెట్టింది పేరు. ఆ తినుబండారాలపట్ల ప్రలోభపడి సత్తిరాజు 'ఎల్లోరా' లో సర్వరు ఉద్యోగం దొరికినా బాగుండునంటుండేవాడు.

ఓ రిక్షాను ఆపి 'హోటలెల్లోరా' అన్నాను.
కొద్ది నిముషాల్లో రిక్షా హోటలు ముందర ఆగింది.
హోటల్లో ప్రవేశించాను.

కౌంటరు దగ్గర కూర్చున్న వ్యక్తి నా వైపు ఎగాదిగా చూచినట్టే గుర్తు. కొత్త కస్టమర్లవైపు హోటలు ప్రొప్రయిటర్లు పరకాయించి చూడడం సహజమే! నేనా విషయాన్ని అంతగా పట్టించుకోలేదు. కౌంటరు దగ్గరకు వెళ్ళి నిలబడి "ఇక్కడెంతండీ భోజనం రేటు?" అంటూ పర్సులోంచి డబ్బు పైకి తీయబోయాను.

ఆ పని చేయడానికి వీల్లేకుండా కౌంటరులో కూర్చున్న వ్యక్తి నా చేతిని గట్టిగా బంధించేశాడు. "ఎన్నాళ్ళకెన్నాళ్ళకయ్యా రామంబాబూ! నేనేనయ్యా సత్తిరాజుని! తల పైకెత్తి నా ముఖంలోకి చూడవయ్యా బాబూ!" అన్నాడు.

ఏం చెప్పాలో తోచక, ఆశ్చర్యం ఎలా ప్రకటించాలో స్ఫురించక చేష్టలుడిగి, గ్రుడ్లు తేలవేసి నిట్టనిలువునా స్తంభీభూతుడినైపోయాను.

"ఒరే చిట్టీ! అయ్యగారి కొక కుర్చీ తెచ్చి వెయ్యరా!" అన్నాడు సత్తిరాజు. పైకిలేచి నన్నా కుర్చీలో కూచోబెట్టాడు. ఇంకా అక్కడే నిల్చున్న కుర్రాడితో "అయ్యగారికొక బాదాంఘీరు" అన్నాడు.

గ్లాసు ఖాళీచేసి వాపసుచేస్తూ ఆశ్చర్యంతో, ఎంతగా బుర్రకు వేడెక్కించినా నువ్విప్పించిన బాదాం ఘీరు మట్టుకూ చల్లగానే ఉంది" అన్నాను.

సత్తిరాజు నవ్వాడు.

ఆ నవ్వు అతడు నాపైన కుప్పించబోతున్న ప్రశ్నలన్నింటికీ ఉపక్రమణిక లాంటిదని తరువాత తెలిసింది.

సొంతంగా నాకు సంబంధించిన విశేషాలన్నీ నేను చెప్పడమయింది. ఇక చెప్పడానికి మిగిలింది తన వంతే! తనదాకా వచ్చేసరికి సత్తిరాజు హోటల్లో వున్న అంతరంగికాగారానికి నన్ను తరలించాడు.

"ఇక్కడ గోడలకు చెవులుండవా?" అన్నాను.

సత్తిరాజు మరింత బిగ్గరగా నవ్వేశాడు.

"ఫరవా లేదులే! నా విషయం యిక్కడందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే! కానీ నన్ను గురించి నేను చెప్పుకోవలసి వచ్చేసరికీ రహస్యం నటించడం అవసరమైంది. అసలేం జరిగిందంటే..."

టూకీగానే చెప్పి ముగించాడు. సత్తిరాజు చెప్పిన విషయంకన్నా, అతడావిషయం చెప్పిన తీరే నా ఆశ్చర్యాన్ని ద్విగుణీకృతం చేసింది. ఉన్న వాస్తవానికి ఏ మాత్రం ఆదర్శాల కోటింగు వేయకుండా తనను గురించిన నిజాన్ని కుండబద్దలు కొట్టినట్టుగా వెల్లడించిన అతని నిష్కాపట్యం ఎదుట నేను దిగ్భ్రాంతికి లోనుగావలసి వచ్చింది. సేల్స్ ఎంపోరియమ్ మూసివేశాక తాను నిరుద్యోగి అయిపోయాడు. ఉద్యోగం ఊడిందని తెలియగానే పెరుమాళ్ళు మేస్త్రీ గది ఖాళీ చేయించాడు. తిండికి ఠికానా లేకుండా, నిల్చోడానికి నీడలేకుండా అతను నానాయాతనకు గురి అయ్యాడు. ఆ సమయానికి సరిగ్గా చెప్పకుండా ఓ సర్వరు మహాశయుడు వుడాయించడం వల్ల ఎల్లోరా హోటల్లో ఓ ఖాళీ ఏర్పడి వుంది. ఆ ఖాళీని భర్తీ చెయ్యడానికి సిద్ధపడ్డాడు సత్తిరాజు. ప్రొప్రయిటరు సుబ్బయ్య కాస్త జంకు గొంకులతోనే సత్తిరాజును తన కొలువలోకి తీసుకున్నాడు. బజారుకు వెళ్ళి అంగడి

సామాన్లు కొనితెస్తూ, మార్కెట్టుకు వెళ్ళి కూరగాయలు పట్టుకొస్తూ, సాయంకాలాల్లో జమా ఖర్చు లెక్కలు వ్రాసిపెడుతూ సత్తిరాజు తన హోదాను పెంచుకుంటున్నాడు. క్రమక్రమంగా సుబ్బయ్యకు అభిమాన పాత్రుడయ్యాడు. వేర్వేరు పట్టణాల్లో సుబ్బయ్య కిలాంటివే మూడు హోటళ్ళున్నాయి. డబ్బు కూడా దండిగానే వుంది. పగటిపూట చూస్తే, రాత్రివేళ కలలోకి వచ్చే రూపురేఖ విలాసాలతో భగవంతుడు సుబ్బయ్యకొక కుమార్తెను ప్రసాదించి వున్నాడనీ, ఆవిడ వెలపోవడానికి అవసరమైతే ఒక హోటలును త్యాగం చెయ్యడానికైనా అతడు సిద్ధమేనని సత్తిరాజు గ్రహించాడు. ఆలోగా ఆ కుర్రవాడు స్వయంగా హోటలు వ్యాపారాన్ని నడిపించుకపోగలడని సుబ్బయ్యకు కూడా నమ్మకం చిక్కింది.

"రూపవతి అయిన భార్య మొగుడికి శత్రువట! అయినా అందం ఎందుకు రామంబాబూ? అదేమైనా కొరుక్కుతినడానికి పనికొస్తుందా?"

అంతటితో ఈ ప్రసంగానికి స్వస్తి అన్నట్టుగా సత్తిరాజు పైకిలేచి పొడుగాటి తాళంచెవితో నిలువెత్తు రెఫ్రిజరేటరు తెరిచాడు. దాన్నిండా కొరుక్కుతినడానికి పనికొచ్చే వస్తువులే వున్నాయి.

కాలింగ్‌బెల్ నొక్కి హెడ్ వెయిటరుని పిలిపించాడు. "అరిటాకు తీసుకురా! అయ్యగారికి స్పెషల్ మీల్స్ వడ్డించు" అన్నాడు.

"మరి మీ సంగతి?" అన్నాడు.

"మొదట అతిథికి చెల్లించాల్సిన మర్యాద చెల్లించనివ్వు! గృహస్థుడి సంగతి తర్వాత..."

ఆకు చుట్టూ కొలువైన వంటకాలవైపు చూస్తూ "మొత్తానికి మన బ్రతుకుల్లో ఏదో సామ్యమున్నట్టే వుందిలే సత్తిరాజూ! నేను మిలిటరీలో చేరాను. నువ్వు మిలిటరీ హోటలు నడుపుతున్నావు" అన్నాను.

"నీ మిలిటరీ ప్రతాపాన్ని భోజనంపైన చూపించు మరి..."

ఖాళీ అయిపోయిన ప్లేట్లను మళ్ళీ మళ్ళీ అవే పదార్థాలతో నింపిస్తూ "ఏది, దీన్ని తిను! దాన్ని నంజుకో! అదింకా ముట్టుకోలేదే నువ్వు! ముందుగా దీన్ని ఖాళీ చేసెయ్" అంటూ తీవ్రంగా పర్యవేక్షణ కొనసాగించాడు.

"బాబూ, నీకొక నమస్కారం! నేనింక నీ పరీక్షకు తట్టుకోలేను" అంటూ వేడుకోటం మినహాగా గత్యంతరం లేకపోయింది.

చేయి కడుక్కుని తిరిగొచ్చేసరికి టేబిలు శుభ్రమైపోయింది. సత్తిరాజు ముందర మాత్రం ఒక ప్లేటు, అందులో ఓ చిన్న కాగితం పార్శెలు.

ఓ గిన్నెలో సాంబారు తీసుకొచ్చి బల్లపైన పెట్టి వెళ్ళాడు వెయిటరు.

ఆ పాటికి సత్తిరాజు పార్శెల్ విప్పేశాడు. అందులో నుంచి ఓ రొట్టెముక్క బయటపడింది.

"ప్రస్తుతం యిదేనయ్యా నా ఆహారం. అనుపానంగా ఉప్పు కారం తగ్గించిన సాంబారు మాత్రమే వాడుకోవాలి. ఇంతకు మించి మరేది తిన్నా మొదటకే మోసమని డాక్టరు సలహా! వెరసీ సారాంశమేమిటంటే తినేవాళ్ళవైపు చూడ్డమే యిప్పుడు నాకు మిగిలిన ఆనందం..."

ద్వారబంధానికి కాగితం పువ్వుల తోరణం కట్టినట్టుగా వెలవెలపోతున్న నవ్వొకటి సత్తిరాజు పెదవులపైన విరిసింది!

♦ 1967 ♦